## క్లుప్తంగా

### ఏఐహెచ్ఆర్ఏ కో ఆర్డినేటర్‌గా లక్ష్మణ్ సింగ్



**నెల్లూరు(బృందావనం):** ఆలిండియా హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ (ఏఐహెచ్ఆర్ఏ) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కో ఆర్డినేటర్‌గా నగరానికి చెందిన చౌహాన్ లక్ష్మణ్ సింగ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా మూలాపేటలో మంగళవారం ఆయన మాట్లాడుతూ మానవహక్కుల సంరక్షణకు తన వంతు కృషిచేస్తానన్నారు. నాలుగు దశాబ్దాలుగా జాతీయ స్థాయిలో అసోసియేషన్ నిర్వహించిన కార్యక్రమాలు, సాధించిన విజయాల స్ఫూర్తితో ముందుకు సాగుతానన్నారు. బాధ్యతలు అప్పగించిన అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎంయూ దువా, కార్యదర్శి ఖలీద్‌పాషాకు లక్ష్మణ్‌సింగ్ ధన్యవాదాలు తెలిపారు.

### 4న రౌండ్ టేబుల్ సమావేశం

**నెల్లూరు(వీఆర్సీసెంటర్):** రాష్ట్రంలో వెంటనే కులగణన చేపట్టాలని కోరుతూ రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లుగా సీపీఐ జిల్లా కార్యదర్శి అరిగెల నాగేంద్రసాయి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 4వ తేదీన సంతపేటలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో జరిగే ఈ సమావేశంలో రాజకీయ పార్టీలు, బీసీ సంఘ నాయకులు పాల్గొనాలని కోరారు.

### రేపట్నుంచి మహాసమాధి మహోత్సవాలు



ఆహ్వానపత్రికల ఆవిష్కరణ

**నెల్లూరు(బృందావనం):** బాలాజీనగర్ శివారు పద్మావతి నగర్‌లోని శ్రీసాయిదర్బార్ అద్దాల మందిరంలో బుధవారం నుంచి శుక్రవారం వరకు సాయిబాబా 107వ మహాసమాధి (ఆరాధన) మహోత్సవాలు జరుగుతాయని మందిరం మేనేజింగ్ ట్రస్టీ మధుసాయి తెలిపారు. శ్రీసాయిమాత నిత్య అన్న ప్రసాదాలయం ద్వారకామాయిలో ఆహ్వానపత్రికలను మంగళవారం శ్రీసాయిదర్బార్ భజన, సత్సంగ్, సేవాదళ్ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం ఉదయం 7 గంటల నుంచి సాయిబాబా భిక్షాటన కార్యక్రమాన్ని పద్మావతి నగర్, బాలాజీనగర్, ఏసీనగర్, సరస్వతీనగర్ తదితర ప్రాంతాల్లో చేపట్టనున్నామన్నారు. విజయదశమిని పురస్కరించుకుని గురువారం వివిధ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. మహాసమాధి మహోత్సవాల ముగింపు సందర్భంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి శ్రీసాయి సచ్చరిత్రము పూర్తి గ్రంధం అఖండ పారాయణ జరుగుతాయన్నారు.

### వివాహిత అదృశ్యం

**నెల్లూరు(క్రైమ్):** నెల్లూరు నగరానికి చెందిన సమీన ఆర్టీసీలో కాంట్రాక్ట్ ఉద్యోగి. గత నెల 25వ తేదీన విధులకు వెళ్లిన ఆమె అక్కడి నుంచి అదృశ్యమైంది. బాధిత కుటుంబ సభ్యులు గాలించారు. ఆమె ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. సమీనకు భర్త, ఇద్దరు పిల్లలున్నారు. వివాహిత అదృశ్యంపై బాధిత కుటుంబ సభ్యులు సోమవారం రాత్రి చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### 7న విజయవాడలో ఫ్యాప్టో ధర్నా



మాట్లాడుతున్న ఫ్యాప్టో కో-కన్వీనర్ మురళీకృష్ణ

**కోవూరు:** ఉపాధ్యాయుల సమస్యలపై ఈనెల 7వ తేదీన విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి ధర్నాను విజయవంతం చేయాలని ఫ్యాప్టో కో-కన్వీనర్ పి.మురళీకృష్ణ పిలుపునిచ్చారు. ఏపీ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) ఆధ్వర్యంలో కోవూరు టీఎస్సీ ప్రభుత్వ జూనియర్ కాలేజ్‌లో మంగళవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ ఉమ్మడి సర్వీస్ రూల్స్ సాధన, 12వ పీఆర్సీ అమలు, మధ్యంతర భృతి, కారుణ్య నియామకాలు, సీపీఎస్ రద్దు, మెమో 57 అమలు, పెండింగ్ బకాయిల చెల్లింపు తదితర డిమాండ్ల సాధన కోసం ధర్నాకు పిలుపునిచ్చామన్నారు. హెడ్‌మాస్టర్ వై.చెంచు రామయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయులకు పాఠాలు బోధించే స్వేచ్ఛ కల్పించాలని, బోధేతర పనుల నుంచి ముక్తి కలగాలని కోరారు. ఫ్యాప్టో నేతలు డేవిడ్ చిన్నబాబు, ఖాజావలీ మాట్లాడుతూ డిమాండ్ల సాధనకై అందరూ ఏకతాటిపైకి రావాలని కోరారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నేతలు జుల్ఫికర్ అలీ అహ్మద్, ఎస్.వెంకటేశ్వర్లు, బి.శ్రీనివాసులు, కె.నాగిరెడ్డి, బి.వెంకయ్య, ఎంవీ సుబ్రహ్మణ్యం, రఫీ అహ్మద్ పాల్గొన్నారు.



మహాలక్ష్మి ఆలయంలో దుర్గాదేవి అలంకారం



వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో మహిషాసురమర్దినిగా..



ఉమామహేశ్వరస్వామి దేవస్థానంలో దుర్గాదేవిగా..



మహాలక్ష్మి ఆలయంలో దుర్గాదేవిగా..



నవాబుపేట కామిశెట్టివారి మహాలక్ష్మి ఆలయంలో..

# అమ్మ రూపం.. దేదీప్యమానం



ధన్వంతరి అలంకారంలో శ్రీనివాసుడు



కన్యకాపరమేశ్వరి ఆలయంలో నిమ్మకాయలతో అలంకారం

- వైభవంగా శరన్నవరాత్రి మహోత్సవాలు

**నెల్లూరు(బృందావనం):** నగరంలో శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. 9వ రోజు మంగళవారం దుర్గాష్టమి సందర్భంగా అమ్మవారు దుర్గాదేవి అలంకారంలో కొలువై భక్తులను అనుగ్రహించారు. భక్తజన సందోహంతో లోకమాత కొలువులు కిటకిటలాడాయి.

➤ రాజరాజేశ్వరి ఆలయంలో అమ్మవారు దుర్గా అలంకారంలో దర్శనమిచ్చారు. దేవస్థాన ప్రాంగణంలోని మీనాక్షీ సుందరేశ్వర స్వామి ఆలయంలో లలితాకుంకుమార్చన, మహన్యాసం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల ఉభయకర్తలుగా రావులపల్లి వెంకట్రామానాయుడు, సులోచనమ్మ, సన్నపురెడ్డి పెంచలరెడ్డి, పద్మావతి, నంబూరి సుబ్బానాయుడు, రాజమ్మ, ఆనం గోపాలకృష్ణారెడ్డి, అమ్మణ్ణమ్మ వ్యవహరించారు.

➤ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. ఆయన వెంట నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వేమిరెడ్డి విజయభాస్కరరెడ్డి, దేవదాయ శాఖ తిరుపతి రీజినల్ జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్ తదితరులున్నారు. మంత్రి మాట్లాడుతూ ఆలయం పక్కన ఉన్న ఖాళీ స్థలంలో రూ.5 కోట్లతో నిర్మించనున్న ధ్యాన మందిరం, కల్యాణ మండపాల నిర్మాణాలకు అవసరమైన నిధులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు.

➤ స్టోన్‌హౌస్‌పేట కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు దుర్గాదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. మూలవర్లను కుంకుమతో, 2 వేల కిలోల నిమ్మకాయలతో అలంకరించారు. ఉభయకర్తలుగా డాక్టర్ కొలవర్తి సుబ్రహ్మణ్యం, సీతాలక్ష్మి, డాక్టర్ వెంకటసునీల్‌కుమార్, లావణ్య, ఎ.కిషోర్, వాణి, ఎస్.మాలకొండయ్య, రజనిప్రియ నరసింహారావు, ఉషప్రియ వ్యవహరించారు.

➤ మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు దుర్గా అలంకారంలో దర్శనమిచ్చారు. మూలవర్లు గాజుల అలంకారంలో విశేషంగా దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతి, కొడవలూరు సుబ్బారెడ్డి, శైలజ, ఆనం రామనారాయణ రెడ్డి, శిరీష దంపతులు, నర్రా రూపేష్ కుమార్‌రెడ్డి వ్యవహరించారు. స్వామిని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి దర్శించుకున్నారు.

➤ సింహపురి గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు లలితాపరమేశ్వరి అలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా ఇందుకూరు గురుస్వామిఆచారి, రత్నమ్మ తదితరులు వ్యవహరించారు.

➤ సీఏఎం హైస్కూల్ రోడ్డులోని ఉమామహేశ్వర స్వామి దేవస్థానంలో అమ్మవారు దుర్గా అలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా అవిలాల మురళి, మాధవి దంపతులు వ్యవహరించారు.

➤ ఏసీనగర్ కోదండరామపురం మహాలక్ష్మి ఆలయంలో అమ్మవారు దుర్గా అలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా ముప్పాళ్ల ఉమాశంకర్, తనూజ, ఎర్రా వెంకట్రావ్, పావని, ఎస్.సత్యసుందరరాజశేఖర్, సూర్యకుమారి వ్యవహరించారు.

➤ మెక్లిన్స్‌రోడ్డు విరాట్‌నగర్‌లోని గాయత్రీదేవి, విశ్వకర్మ భగవాన్‌స్వామి, గోవిందమాంబ సమేత జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో అమ్మవారు మహిషాసురమర్దిని అలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా బోయమడుగుల శ్రీనివాస్ ప్రసాద్ ఆచారి, జ్యోతి, కందుకూరు మోహన్ ఆచారి, కల్యాణి, బొంతా సుదీప్, తేజశ్విని, వొమ్మిన మురళీకృష్ణ, భార్గవి వ్యవహరించారు.

➤ బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో అమ్మవారు భవాని అలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా తాతా వెంకటకిషోర్‌కుమార్, హేమలత దంపతులు వ్యవహరించారు.

➤ నవాబుపేటలోని భ్రమరాంబసమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారు దుర్గాదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా పంచాగ్నుల సోదరులు వ్యవహరించారు.

➤ నవాబుపేటలోని శ్రీమత్ ద్రౌపతీదేవి సమేత శ్రీకృష్ణధర్మరాజ స్వామి ఆలయంలో అమ్మవారు దుర్గాదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా 3వ మైలు సాదా వారి నగర మిత్ర మండలి వ్యవహరించింది.

➤ మూలాపేటలోని శ్రీమత్ ద్రౌపతీదేవి సమేత శ్రీకృష్ణధర్మరాజస్వామి ఆలయంలో అమ్మవారు దుర్గా అలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా టి.అభిమన్యు, సత్యవతి దంపతులు వ్యవహరించారు.

➤ నవాబుపేట పరుచూరివారివీధి కామిశెట్టి వారి మహాలక్ష్మి దేవస్థానంలో అమ్మవారు దుర్గాదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా డి.శేషాద్రి, లక్ష్మి దంపతులు వ్యవహరించారు.

➤ మూలపేట శంకరమఠం ప్రాంగణంలోని కామాక్షి సమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో దుర్గాదేవి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. చండీహోమంనిర్వహించారు. ఉభయకర్తలుగా పి.శ్రీనాథ్‌రెడ్డి, వారణాసి ఫణి వ్యవహరించారు..

➤ **నెల్లూరు(వీఆర్సీసెంటర్):** దసరా ఉత్సవాల్లో భాగంగా నెల్లూరు నగరంలోని వెంకటేశ్వరపురంలో ఉన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం ఉదయం సుదర్శన యాగం జరిగింది. పెద్దసంఖ్యలో భక్తులు హాజరయ్యారు. సాయంత్రం స్వామి ధన్వంతరి అలంకారంలో దర్శనమిచ్చారు. రాత్రి గురుకృపా కళాక్షేత్రం వారు నిర్వహించిన శాస్త్రీయ జానపద నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ కార్యక్రమాలకు పసుపులేటి శ్రీనివాసులు – మోహనప్రీతి, రాజేష్ – లావణ్య, అరుణ్‌కుమార్ – సంధ్యారాణి, సుధీర్ – గౌతమి, నరసాపురం ప్రసాద్ – రమాదేవి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు సాయి భరద్వాజ, చైర్మన్ నాగిరెడ్డి, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.



నవాబుపేట భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో..



రాజరాజేశ్వరి ఆలయంలో భక్తులు

# అక్రమాలకు అడ్డుకట్ట వేయండి



మహాత్ముని విగ్రహం వద్ద వినతిపత్రం పెడుతున్న నేతలు

**నెల్లూరు రూరల్:** హౌసింగ్‌లో అక్రమాలకు ఉన్నతాధికారులు అడ్డుకట్ట వేయాలని బీజేపీ నేత మిడతల రమేష్ కోరారు. కలెక్టరేట్‌లోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నేతలు మంగళవారం వినతిపత్రం ఉంచి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పక్కాగృహాల్లో వసతులు లేనందున లబ్ధిదారులు చేరేందుకు ఇష్టపడటం లేదన్నారు. వివిధ అంశాలను ఎండీ కార్యాలయం దృష్టికి తీసుకెళ్లినా స్పందించ లేదన్నారు. హౌసింగ్ ప్రిన్సిపల్ సెక్రటరీ జోక్యం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అల్లూరు నాగేంద్ర సింగ్, సృజన, పద్మ, బాలాజీ, రాములు యాదవ్, నారాయణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# గేదె అపహరణపై కేసు నమోదు

**నెల్లూరు(క్రైమ్):** ఇంటి ముందు ఖాళీ స్థలంలో కట్టి ఉంచిన గేదెను ఇద్దరు దుండగులు ఎత్తుకెళ్లిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. పడారుపల్లి చలపతినగర్‌లో ఎం.ప్రభాకర్ నివాసముంటున్నాడు. అతను ఎనిమిది గేదెలను పెట్టుకుని పాలు వ్యాపారం చేస్తున్నాడు. రోజూ గేదెల్ని తన ఇంటి ముందున్న ఖాళీ స్థలంలో కట్టేసేవాడు. గతనెల 14వ తేదీ అర్ధరాత్రి దాటిన తర్వాత ఇద్దరు గుర్తుతెలియని దుండగులు గేదెను అపహరించుకుని వెళుతుండటాన్ని గుర్కా చూసి బాధితుడికి తెలియజేశాడు. ప్రభాకర్ సీసీ కెమెరాలను పరిశీలించగా నిందితులు సుందరయ్య కాలనీకి చెందిన మంజునాథ్, వెంకటేష్‌గా గుర్తించారు. బాధితుడు వారి కోసం గాలించినా జాడ తెలియరాలేదు. ప్రభాకర్ మంగళవారం వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రయాణం.. నరకం



గుంతలమయంగా ప్రధాన రహదారి

**నెల్లూరు సిటీ:** రోడ్లు అభివృద్ధి చేశామని కూటమి నేతలు చెబుతుంటారు. అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. అనేక రహదారులు ప్రయాణికులకు నరకం చూపిస్తున్నాయి. మూడో మైలులో ప్రధాన రోడ్డు దారుణంగా ఉంది. దీనిపై రోజూ వందల సంఖ్యలో వాహనాలు తిరుగుతుంటాయి. అడుగుమేర గుంతలుండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా చాలు రోడ్డు మధ్యలో గుంతల్లో నీరు చేరుతుంది. రాత్రి వేళల్లో వేగంగా వచ్చే వాహనాలు గుంతల్లో పడుతున్నాయి. అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

## భర్త వేధింపులపై ఫిర్యాదు

**నెల్లూరు(క్రైమ్):** భార్యను వేధింపులకు గురిచేస్తున్న భర్తపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. జొన్నవాడ రోడ్డు సాయినగర్‌కు చెందిన దిల్షాద్‌కు జెండావీధికి చెందిన గౌస్‌బాషాతో వివాహమైంది. వారికిద్దరు సంతానం. గౌస్‌బాషా ఎంబ్రాయిడరీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. అతను తరచూ భార్యకు చెప్పకుండా ఎటో వెళ్లి కొద్దిరోజుల అనంతరం తిరిగి వచ్చేవాడు. పుట్టింటికి వెళ్లి డబ్బులు తీసుకురావాలని భార్యపై ఒత్తిడి చేసేవాడు. నాలుగునెలల క్రితం అతను వెళ్లిపోయాడు. గతనెల 29వ తేదీ రాత్రి ఇంటికొచ్చిన గౌస్‌బాషా షాపు పెట్టుకునేందుకు డబ్బులివ్వాలని భార్యను అడిగాడు. ఆమె సమాధానం చెప్పేలోపే దాడి చేశాడు. ఈ విషయం పోలీసులకు చెబితే చంపుతానని, లేదా నీ పేరు, మీ అమ్మ, తమ్ముడి పేర్లు రాసి చనిపోతానని భార్యను బెదిరించి వెళ్లాడు. బాధితురాలు మంగళవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## కలెక్టర్‌ను కలిసిన ఎంపీ



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వేమిరెడ్డి

**నెల్లూరు రూరల్:** కలెక్టర్ హిమాన్షు శుక్లాను నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మంగళవారం కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇద్దరూ జిల్లా అభివృద్ధిపై చర్చించారు. సమస్యలు, చేపట్టాల్సిన అంశాలు, పెండింగ్ విషయాలపై మాట్లాడారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, కేతంరెడ్డి వినోద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పందిటి సుబ్బయ్య మాదిగ నేతృత్వంలో జిల్లా మాదిగ సంఘాల వర్గీకరణ పరిరక్షణ జేఏసీ నేతలు కలెక్టర్‌ను కలిశారు. కార్యక్రమంలో నేతలు పల్లాల శ్రీనివాసులు, గడ్డం శేఖర్, పలిగిలి వెంకటరమణయ్య, కప్పల దాసు, మంచు కామయ్య, షేక్ రియాజ్ తదితరులు పాల్గొన్నారు.
- **నెల్లూరు(క్రైమ్):** ఎంపీ వేమిరెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ అజిత వేజెండ్లను మర్యాదపూర్వకంగా కలిశారు.

# నష్ట పరిహారం అందించేలా చర్యలు



నివాసాన్ని పరిశీలిస్తున్న నాయకులు

**నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట):** గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు, సామగ్రి దెబ్బతిన్న ఖాజారంతుల్లా కుటుంబానికి ప్రభుత్వం ద్వారా నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని నూర్‌బాషా సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఖాదర్‌బాషా తెలిపారు. బాలాజీనగర్ వేపదరువులో ప్రమాదానికి గురైన ఖాజారంతుల్లా నివాసాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో సంఘం నేతలు జాఫర్‌జాన్, ఖాజామస్తాన్, సుభాన్ బాషా, జహీర్, సందానీబాషా, మస్తానమ్మ, హబీబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

# రూ.16.7 కోట్లతో పునర్నిర్మాణ పనులు



వివరాలు తెలుసుకుంటున్న ఆనం

**నెల్లూరు(బృందావనం):** మూలాపేటలోని రుక్మిణీసత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయానికి రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మంగళవారం విచ్చేశారు. రూ.16.7 కోట్లతో జరుగనున్న పునర్నిర్మాణ పనులకు సంబంధించి అధికారులకు పలు సూచనలిచ్చారు. ఈనెల 29వ తేదీన బుధవారం ఉదయం 11:18 గంటలకు త్రిదండి చిన్న జీయర్‌స్వామి చేతుల మీదుగా పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడం జరుగుతుందని మంత్రి తెలిపారు. ఆయన వెంట నారాయణ విద్యాసంస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కరరెడ్డి, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తల మండలి చైర్మన్ మజ్జిగ చంద్రమౌళిరెడ్డి, పలువురు దేవదాయ శాఖ అధికారులు, స్థపతి, ఇంజినీరింగ్ సిబ్బంది ఉన్నారు.

# • అమ్మకు సాయంగా..



ఓ కుటుంబం నెల్లూరు మినీ బైపాస్‌రోడ్డులో దేవుళ్ల విగ్రహాలు తయారు చేసి జీవనం సాగిస్తోంది. తల్లికి సాయంగా చిన్నారి విగ్రహాలకు రంగులు వేస్తుండగా తీసిన చిత్రం.
– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు